# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 267 | శుక్రవారం, 04 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4


## రాధాగోపాళం

- జిల్లాలోని పలు స్కూళ్లలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు
- కృష్ణులు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు

4






- కేజీబీవీలో భద్రత వైఫల్యం
- గస్తీ పోలీసుల అప్రమత్తతతో రక్షణ
- విద్యార్థినుల అదృశ్యంపై కలకలం
- తల్లిదండ్రుల్లో ఆందోళన

**జనగామ, మన చౌరాస్తా :**

జనగామ జిల్లా ఖిలాషాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్మీడియట్ చదువుతున్న నలుగురు విద్యార్థినులు గురువారం ఉదయం హాస్టల్ నుండి అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. అయితే రాత్రి గస్తీలో ఉన్న పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి వారిని సురక్షితంగా విద్యాలయానికి చేర్చారు.

### సంఘటన వివరాలు..

హాస్టల్ లో నుంచి బయటకు వచ్చిన ఈ నలుగురు విద్యార్థినులు వడ్లకొండ శివారు ప్రాంతంలో సంచరిస్తుండగా గురువారం రాత్రి గస్తీ విధుల్లో ఉన్న పోలీసులు వారిని గుర్తించారు. అనుమానాస్పదంగా కనిపిస్తుండటంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదే సమయంలో ఒక విద్యార్థిని తండ్రి తన కుమార్తె కనిపించడం లేదని రఘునాథపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చిందని తెలుస్తోంది. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా వివరాలు సేకరించిన పోలీసులు, రాత్రికి రాత్రే విద్యార్థినుల ఆచూకీ కనుగొని, నలుగురినీ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌వో)కి సురక్షితంగా అప్పగించారు.

### కేజీవీబీ నిర్వహణపై విమర్శలు

ఈ ఘటనతో కస్తూర్బా విద్యాలయంలో భద్రతా లోపాలు, నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ఒక్క విద్యార్థిని తండ్రి మాత్రమే తన కుమార్తెను తీసుకెళ్లేందుకు అనుమతి కోరగా స్పెషల్ ఆఫీసర్ మాత్రం మిగతా ముగ్గురు విద్యార్థినులను కూడా నిబంధనలకు విరుద్ధంగా బయటకు పంపినట్లు తెలుస్తోంది. పాఠశాల నిబంధనలను కాదని స్పెషల్ ఆఫీసర్ ఈ విధంగా వ్యవహరించడం పట్ల విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రతా వ్యవహారంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### తల్లిదండ్రుల ఆందోళన..

ప్రభుత్వం బాలికల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేజీబీవీల్లో నాణ్యమైన విద్యతో పాటు వారి భద్రత, సంరక్షణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అయితే కొందరు కేజీబీవీ సంరక్షకులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తల్లిదండ్రుల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. ఇలాంటి ఘటనలతో తమ పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనుకంజ వేసే పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలికల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించకుండా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించి ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



### విద్యార్థుల ఘటనపై విచారణ చేపడతాం..

రఘునాథ పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి ఒక పేరెంట్ తన కూతురును తీసుకెళ్లడంతో పాటు మరో ముగ్గురు విద్యార్థినులను కూడా వెళ్లారు. అలా విద్యార్థినులను బయటకు తీసుకెళ్లేందుకు స్పెషల్ ఆఫీసర్ అనుమతి ఇవ్వడం కూడా నిబంధనలకు విరుద్ధం. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. - గౌసియా బేగం, జీసీడీవో




### తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలనం

- బీసీ ఆత్మగౌరవమే ఎజెండాగా అడుగులు
- నిరాశతో ఉన్న అధికార, ప్రతిపక్ష నాయకులకు గాలం
- మీడియా ముందు మీసం మెలేసిన కొండా మురళి

2 లో



# కొత్త పార్టీ దిశగా కొండా..!

## తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలనం

- బీసీ ఆత్మగౌరవమే ఎజెండాగా అడుగులు
- నిరాశతో ఉన్న అధికార, ప్రతిపక్ష నాయకులకు గాలం
- మీడియా ముందు మీసం మెలేసిన కొండా మురళి

**(హనుమకొండ, మన చౌరాస్తా )**

తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజల్లో బలమైన కేడర్ ఉన్న మంత్రి కొండా సురేఖ, కొండా మురళీధర్ రావు దంపతులు నూతన రాజకీయ శక్తిగా ఆవిర్భవించేందుకు సమాయత్తమవుతున్నారనే వార్తలు అన్నివర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. బీసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవమే అజెండాగా వారు ఈ నిర్ణయం తీసుకోబోతున్నారనే ఆలోచన రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది.

### కొత్త పార్టీ వైపు అడుగులు

రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీ సామాజిక వర్గాలను ఒకే తాటిపైకి తెచ్చేందుకు కొండా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో టికెట్లు దక్కక నిరాశలో ఉన్న సమర్థులైన నాయకులకు తాము పెట్టేబోయే కొత్త పార్టీ ద్వారా అవకాశం కల్పించి, గెలిపించుకునే వ్యూహంతో ఉన్నరని తెలుస్తోంది.

### కింగ్ మేకర్ కోసమా!

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ హోరాహోరీగా ఉండి హంగ్ పరిస్థితులు ఏర్పడితే, లభించే ఎన్ని స్థానాలైనా రాష్ట్రంలో అధికార సమీకరణాలను మార్చే నిర్ణయాత్మక శక్తిగా (కింగ్ మేకర్) మారుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కవిత, తీన్మార్ మల్లన్న వంటి నాయకులు తమ స్వంత వేదికల ద్వారా ప్రజల్లో గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. దశాబ్దాలుగా ప్రజాదరణ ఉన్న తాము కూడా ఎందుకు స్వతంత్రంగా ముందుకు రాకూడదనే ఆలోచనలో కొండా దంపతులు ఉన్నట్టు తెలస్తోంది. దీనిపై ఇప్పటికే బీసీ మేధావులు, శ్రేయోభిలాషులు, మద్దతుదారులతో విస్తృత స్థాయిలో సమాలోచనలు చేసినట్టు సమాచారం. కొత్త పార్టీ ప్రకటన అనంతరం నేరుగా ప్రజల్లోకి వెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్త పాదయాత్రకు ప్రణాళికలు రెడీ చేసుకున్నట్టు తెలుస్తోంది.

### మీసం మెలేసిన మురళి

కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని సీఎంఓ నుంచి గవర్నర్‌కు లేఖ పంపిణీ అనంతరం ఆమె హైదరాబాద్లో నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. తనను బర్తరఫ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకమాండ్ను బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపించారు. అదే సమయంలో కొండా మురళి ఇంటిపైన కారిడార్ నుంచి మీడియాను చూస్తూ మీసం మెలేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ఇప్పుడు వైరల్‌గా మారాయి.

# మంత్రి కొండా సురేఖ అవుట్!

- క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేసిన హైకమాండ్
- గవర్నర్‌కు లేఖ పంపిన సీఎంవో
- కాంగ్రెస్ హైకమాండ్ సంచలన నిర్ణయం



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగుతోంది. మంత్రి కొండా సురేఖను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు ఆమెను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం (CMO) నుంచి గవర్నర్‌కు అధికారిక లేఖ పంపింది.

### హైకమాండ్ ఆగ్రహం

గత కొంతకాలంగా పార్టీ అంతర్గత విషయాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విధానాలపై కొండా సురేఖ దంపతులు, వారి కుమార్తె సుస్మితా చేసిన వ్యాఖ్యలను అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించేది లేదని ఏఐసీసీ స్పష్టం చేసింది.

### బర్తరఫ్ లేఖ..

హైకమాండ్ ముందుగా సురేఖ చేత రాజీనామా చేయించాలని చూసినప్పటికీ, అందుకు అంగీకరించకపోవడంతో బర్తరఫ్ వేటు వేయడమే మార్గమని భావించారు. ఈ క్రమంలో సీఎంవో నుంచి గవర్నర్ ఆమోదం కోసం లేఖను పంపింది.

### రాజకీయ మార్పులు..

కొండా సురేఖపై వేటు పడటంతో తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ పరిణామంపై కొండా దంపతులు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ఏఐసీసీ (AICC) ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



# విద్యార్థినుల సౌకర్యాలే లక్ష్యం

- కేజీబీవీ అభివృద్ధికి రూ.38 లక్షలు
- ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**దేవరుప్పల, మన చౌరాస్తా :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (KGBV)లో రూ.38 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, శానిటేషన్, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆడబిడ్డల విద్యకు పెట్టే ప్రతి రూపాయి వారి భవిష్యత్తుకు పెట్టుబడేనని పేర్కొన్నారు. KGBVలో మరిన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### దేవరుప్పలలో కాంగ్రెస్ విజయోత్సవం

పీసీసీ ఆదేశాల మేరకు దేవరుప్పుల మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ముందుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

### ఎస్‌జీఎఫ్ క్రీడాకారులకు బహుమతులు

పాలకుర్తి : తొర్రూరు గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# నర్మెట్ట జడ్పీహెచ్ఎస్‌లో ఎస్జీఎఫ్ క్రీడలు

నర్మెట్ట, మన చౌరాస్తా : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 17వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా ఎంపికలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా సర్పంచ్, జనగామ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోపగోని శ్రీధర్ గౌడ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొలపాక స్వామి, ఎస్‌జీఎఫ్ అధికారులు శ్రీదేవి, మాధవి, కె. సంగీతమాధురి, సతీష్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

**మెనూ ప్రకారం సమయానికి ఆహారం అందించాలి**

**ఎస్సీడీడీ కార్యదర్శి, జిల్లా ఎస్ఐఆర్ అబ్జర్వర్ విజయేందిర బోయి**



**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించి, వారి బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్సీడీడీ) కార్యదర్శి, జిల్లా ఎస్ఐఆర్ అబ్జర్వర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం జనగామ జిల్లా పర్యటనకు వచ్చిన విజయేందిర బోయి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి హనుమకొండ రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల హాజరు, వసతులు, భోజన నాణ్యత, పరిశుభ్రత, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి, వారి లక్ష్యాలు, అభిరుచులు, చదువుపై ఆసక్తి గురించి తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఇష్టంతో చదివితే తప్పకుండా విజయం సాధించవచ్చని విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చారు. కేవలం పాఠ్యాంశాలు చెప్పడం కాకుండా ప్రతి విద్యార్థికి అర్థమయ్యే విధంగా బోధన సాగాలని, చదువుపై ఆసక్తి పెంచే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ గురుకుల విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలు, వసతులు, పోషకాహార నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అదే స్థాయిలో గురుకులాల్లో విద్యా నాణ్యత కనిపించాలన్నారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, ఆలోచించడం వంటి నైపుణ్యాలను పెంపొందించేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీలో భాగంగా మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, ఆర్ట్ గ్యాలరీ, జిమ్ గది, స్టాక్ రూమ్‌లను పరిశీలించారు. స్టాక్ రూమ్‌లో బియ్యం, ఇతర ఆహార నిల్వల నాణ్యతను తనిఖీ చేసి, మెనూ ప్రకారం సమయానికి పోషకాహారం అందించాలని ఆదేశించారు. పరిశుభ్రమైన కూరగాయలు వినియోగించాలని, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు. పాఠశాలలో ప్రవేశాలు, విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, విద్యా ఫలితాల వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అదనపు మౌలిక వసతులపై నివేదికలు సిద్ధం చేసి, సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. పాఠశాల ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. విద్యార్థుల ఏకరూప దుస్తులలో ఉన్న లోపాలను వెంటనే సరిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిమ్ గదులకు రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. అంతకుముందు జిల్లా పర్యటనకు విచ్చేసిన విజయేందిర బోయికి జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతించారు. ఈ తనిఖీలో ఆర్డీఓ గోపిరామ్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి విక్రమ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీ లత, జోనల్ అధికారి ఎస్.విద్యారాణి, డీసీఓ పి.మాన్విచంద్, ప్రిన్సిపాల్ ఏ.నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా జరగాలి

**జిల్లా ఎస్ఐఆర్ అబ్జర్వర్ విజయేందిర బోయి**



**జనగామ, మన చౌరాస్తా :** ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)2026 ప్రక్రియలో భాగంగా నోటీసుల హియరింగ్, అభ్యంతరాల పరిష్కారాన్ని నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వ ఎస్సీడీడీ కార్యదర్శి, జిల్లా ఎస్ఐఆర్ అబ్జర్వర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. గురువారం జనగామ మండలంలోని శామీర్‌పేట్, మున్సిపల్ కార్యాలయాల్లోని ఎస్ఐఆర్ హియరింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల నమోదు, రికార్డుల ధృవీకరణ ప్రక్రియలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నో మ్యాపింగ్, వ్యత్యాసాల కేటగిరీల దరఖాస్తులను ఆధారాలతో సరిపోల్చి మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే 2002 నాటి ఓటరు జాబితాను పరిశీలించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని, రోజువారీ లక్ష్యాలతో పనులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరామ్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పకడ్బందీగా పూర్తి చేయాలి**

జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్సీడీడీ) కార్యదర్శి, జిల్లా ఎస్ఐఆర్ అబ్జర్వర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్లతో కలిసి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్సీడీడీ) కార్యదర్శి, జిల్లా ఎస్ఐఆర్ అబ్జర్వర్ విజయేందిర బోయి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై అబ్జర్వర్ జిల్లాలోని పురోగతి, కేసుల నిర్వహణ, మ్యాపింగ్, హియరింగ్‌ల వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.

# శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి శ్రీకృష్ణాష్టమి వేడుకలకు యాదవ కుల పెద్దలు, కులబాంధవులు, హిందూ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ కోరారు. శ్రీకృష్ణాష్టమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నెహ్రూ పార్క్ నుంచి ర్యాలీ ప్రారంభమై బతుకమ్మ కుంట వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం పూజా కార్యక్రమం, ఉట్టి కొట్టే కార్యక్రమం, నృత్య ప్రదర్శనలు, సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యాదవ బంధువులు, హిందూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# రాపాక సత్యనారాయణకు అస్వస్థత

**పాలకుర్తి, మన చౌరాస్తా :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ బ్లాక్ నాయకుడు రాపాక సత్యనారాయణ (సతన్న) అకస్మాత్తుగా అస్వస్థతకు గురికావడంతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సతన్నకు అవసరమైన వైద్య సేవలు వెంటనే అందించాలని, చికిత్సలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సతన్న కోలుకుని తిరిగి ప్రజా సేవలో పాల్గొనాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# ఎమ్మెల్యేను కలిసిన సీఐ భరత్ సుమన్



**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి పోలీస్ సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన భరత్ సుమన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీఐకి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలని ఆకాంక్షించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు నిబద్ధతతో పనిచేస్తానని సీఐ భరత్ సుమన్ తెలిపారు.

# కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించాలి



జనగామ, మన చౌరాస్తా : జనగామ జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ జనగామ జిల్లా ప్రచార కార్యదర్శి భూస రమేష్ యాదవ్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సిద్ధిరాజు యాదవ్ ఆదేశాల మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, యాదవ సోదరులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి యాదవుల ఐక్యతను చాటుతూ ఈ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జూబ్లీహిల్స్ శాసన సభ్యుడు అనిల్ యాదవ్ తో పాటు యాదవ వర్గానికి చెందిన పలువురు పెద్దలు హాజరుకానున్నారు. శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నెహ్రూ పార్క్ (యాదవ్ నగర్) నుండి బతుకమ్మ కుంట వరకు వైభవంగా ప్రదర్శన నిర్వహించి, అనంతరం సంప్రదాయ ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
శుక్రవారం, 04 సెప్టెంబర్ 2026
Mana Chourasta


# విద్యాలయాల్లో బృందావనం

## జనగామ కాన్సెప్ట్ స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ కాన్సెప్ట్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వేషధారణ పోటీల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా గోపికల రూపాల్లో అలంకరించుకుని ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుని బాల్యలీలలు, ధర్మం, సత్యం, మానవతా విలువలను విద్యార్థులకు వివరించారు. చిన్నారుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ వేడుకల్లో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.






## ఏకశిలా పబ్లిక్ స్కూల్‌లో..

**జనగామ, మన చౌరాస్తా :** ఏకశిలా పబ్లిక్ స్కూల్‌లో శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని ముందస్తుగా జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. విద్యార్థుల నృత్యాలు, కోలాటాలు, శ్లోకాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఇందిర, సెక్రటరీ ఉపేందర్‌రెడ్డి పాల్గొని చిన్నారులను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## సన్‌షైన్ స్కూల్‌లో..

**జనగామ, మన చౌరాస్తా :** సన్‌షైన్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో అలరించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలు, భగవద్గీత బోధనలు, ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ, ప్రేమ, మానవతా విలువలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. చిన్నారుల వేషధారణలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ CH శ్రీనివాస్, డైరెక్టర్లు ఎండీ అన్వర్, నవీన్, మనోజ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ అరబిందో హైస్కూల్‌లో...

**జనగామ, మన చౌరాస్తా :** శ్రీ అరబిందో హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింబించేలా ప్రత్యేకంగా అలంకరించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. చిన్నారుల కృష్ణుడు, రాధ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పండుగల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను పరిచయం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. విద్యతో పాటు సాంస్కృతిక విలువలను కూడా విద్యార్థులు అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.






## గౌతమ్ మోడల్ స్కూల్‌లో..



**జనగామ, మన చౌరాస్తా :** గౌతమ్ మోడల్ స్కూల్ -జనగాం ఆధ్వర్యంలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ప్రీప్రైమరీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. చిన్నారుల ముద్దు ముద్దు హావభావాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ మోతే సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. చిన్నారులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మన సంస్కృతి పట్ల గౌరవభావాన్ని పెంపొందించుకుంటారని తెలిపారు. శ్రీకృష్ణుడి జీవితంలోని ధర్మం, సత్యం, ధైర్యం, ప్రేమ వంటి విలువలను పిల్లలు అలవర్చుకోవాలని ఆకాంక్షించారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**